# మరబొమ్మ కాదు - మనిషే!

-కందుకూరి వెంకట మహాలక్ష్మి

డోర్ బెల్ మోగగానే చెంగునలేచి, పరిగెత్తినట్లే వెళ్లింది ప్రేమ తలుపు తియ్యడానికి.

తల్లి ఆరోగ్యం బాగా లేదని కబురొచ్చిన శ్రీకాంత్ వూరికి వెళ్లి వారం రోజులయింది. ఈ రోజు వస్తున్నట్టు ఉత్తరం రాసాడు. అతని రాకకి వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్న ప్రేమ ఆ బెల్ నొక్కింది అతనే అని పరిగెత్తుకుంటూ తలుపు తీసింది ఆనందంతో.

ఎదురుగా భర్త ప్రక్కనే ఓ పాతికేళ్ళ యువతి తలొంచుకుని నిలబడి వుంది. రెండు పెట్టెలు, ఓ బేగ్‌తో లోపలికొచ్చారిద్దరూ తలొంచుకుని.

పిచ్చిదానిలా వాళ్ళిద్దర్నీ చూస్తూ పక్కకి తప్పుకున్న ప్రేమ నోటంట మాట రాలేదు. కారణం బుగ్గని చుక్క, కాళ్ళకి పారాణి, మెళ్ళో బొందుతాడుని మంగళసూత్రాలు. కల్యాణం బొట్టుతో వున్న ఆ స్త్రీ నల్లగా నిగనిగలాడుతూ వుంది. ఆ స్త్రీ బట్టాకట్టూ చూస్తే బాగా పల్లె వాతావరణంలో పెరిగినట్లుగా వుంది.

ప్రేమకి అంతా అయోమయంగా వుంది. తల్లి ఆరోగ్యం బాగాలేదని భర్త వెళ్ళడ మేమిటి? వెళ్ళిన వాడు యిలా ఓ పెళ్ళికూతుర్ని వెంట తీసుకు రావడమేమిటి? ఏమీ అర్థం కావటం లేదు. తల గిర్రున తిరిగిపోతోంది. ఏమీ అర్థం కావడం లేదు. కాళ్ళ క్రింద నేల ఒరిగిపోతున్నట్లుంది. పిచ్చిదానిలా వాళ్ళనే చూస్తూ అలా నిలబడి పోయింది ప్రేమ.

'ప్రేమా! తను లలిత. మా అత్తకూతురు. నా రెండో భార్య. మేడమీద గదిలో తన సామాను పెడతాను' అంటూ తనే మౌనాన్ని ఛేదిస్తూ ప్రేమకేసి చూస్తూ "రా లలితా!" అంటూ సామాను తీసుకుని మేడమీద తమ పడకగది పక్క గదిలోకి ఆమె సామాను తీసుకెళ్ళాడు శ్రీకాంత్.

భర్త మాటలకి గుండె దడదడ కొట్టుకోసాగింది. కళ్ళు చీకట్లు కమ్మసాగాయి. ఏదో పెద్ద బండరాయి తలమీద పడ్డట్టయి, పక్కనే వున్న సోఫా మీద కూర్చోబడి పోయింది ప్రేమ.

ప్రేమ, శ్రీకాంత్‌ల వివాహమయి రెండేళ్ళు నిండలేదు. శ్రీకాంత్ ప్రేమ చదివే కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. ప్రేమని చూసి ప్రేమలో పడ్డ శ్రీకాంత్ ఓ రోజు ఆమె యిష్టాన్ని అడిగాడు. ప్రేమ కూడ అభ్యంతరం చెప్పక పోవడంతో వాళ్ళ పెద్ద వాళ్ళు యిష్టపడక పోయినా ధిక్కరించి పెళ్ళి చేసుకున్నారిద్దరూ. ప్రేమ తల్లి తండ్రులు 'వేరే కులం వాడిని చేసుకున్నావు, నా కూతురు చచ్చిందనుకుంటాం' అన్న ఒక్క మాటతో ఆమెతో సంబంధాలు తెగతెంపులు చేసుకొన్నారు. శ్రీకాంత్ తల్లి తండ్రులు కొడుకుతో సంబంధం తెంపుకోకుండా కోడల్ని మాత్రం తమింటి గడప తొక్కనివ్వలేదు.

శ్రీకాంత్ తల్లిదండ్రులు తనని రానివ్వక పోవడానికి కారణం "నాకో మేనత్త కూతురుంది. ఆమెనిచ్చి నాకు పెళ్ళి చెయ్యాలన్నది వాళ్ళ అభిమతమని, ఆ పిల్లని చేసుకోనందుకే వాళ్ళకి కోపమని చెప్పేవాడు. అవన్నీ చెప్పడం మర్చిపోవడం పరిపాటయి పోయింది. వాళ్ళనేం పట్టించుకోకుండా తనూ, భర్తా ఎంతో ఆనందంగా కాలం గడుపుతున్నారు. అయితే యిప్పుడింటికొచ్చిన ఆ స్త్రీ శ్రీకాంత్ మేనత్త కూతురేనా! మగబుద్ధి యింత స్వార్థంతో నిండి వుంటుందా? అంత మేనత్త కూతురి మీద మోజున్న వ్యక్తి నన్నెందుకు పెళ్ళిచేసుకున్నాడు. అసలు తనని పెళ్ళి చేసుకుంటానని అడిగింది శ్రీకాంతే కదా! రెండేళ్ళల్లోనే తన మీద మోజు తీరిపోయినట్లేనా? కొందరు మొగవాళ్ళు చేసే మోసాల్లో యిదోరకమా?" అంటూ ఆలోచిస్తున్న ప్రేమ దగ్గర కొచ్చి కూర్చున్నాడు శ్రీకాంత్.

ప్రేమా! అన్న పిలుపుతో ప్రేమ ఈ లోకంలో కొచ్చి, ఏమిటన్నట్టు శ్రీకాంత్ వైపు చూసింది.

'కోపమా ప్రేమా!" అన్న అతని మాటలకి ఏమీ జవాబు చెప్ప కుండానే ముఖం పక్కకి తిప్పుకుంది. ప్రేమని తన వైపుకి తిప్పుకున్న శ్రీకాంత్ చెప్పేది వినక తప్పలేదు ప్రేమకి.

"అమ్మ ఆరోగ్యం బాగుండలేదు ప్రేమా!" అన్న దానికి "అయితే మీ అమ్మ ఆరోగ్యానికి యింకో పెళ్ళాన్ని తెచ్చుకోడానికి సంబంధమేమిటి?" అంది రయ్యిన లేస్తూ, భర్త చేతిని భుజం మీద నుంచి తోసేస్తూ! "ఒక్కసారి నా మాట పూర్తిగా విను అంటూ చేతిని పట్టుకుని పక్కన కూర్చోపెడుతూ-"

చూడు ప్రేమా! మా అమ్మ యిహనో, యిప్పుడో అని వుంది. తల్లీ, తండ్రీ లేని మా అత్త కూతుర్ని చిన్నప్పటి నుంచీ మా అమ్మే పెంచడం, నాకే యిచ్చి పెళ్ళి చెయ్యాలనుకోవడం, మా పల్లెటూర్లో అంతా అదుగో నీ మొగుడొస్తున్నా డంటూ- నేను వెళ్లినప్పుడల్లా లలితని అనడం, ఆట పట్టించడంతో లలిత కూడా నన్నే భర్తగా మనసులో ముద్ర వేసుకుని, నన్ను భర్తగా ఆదరించేది. నాకు మాత్రం నిత్యం యింట్లో తన్ని చూస్తూ ఉండడంతో భార్య అన్న ఆలోచన కలిగేది కాదు. ఈసారి అమ్మ ఆరోగ్యం బాగాలేక వెళ్ళినప్పుడు నా చేతులు పట్టుకుని ఆమె ఒకటే ఏడుపు. తను పోయేటప్పుడు మనశ్శాంతితో పోవాలనుకుంటున్నాననీ, లలితని పెళ్ళి చేసుకోమనీ లలితని యింకెవరికిచ్చి పెళ్ళిచెయ్యను; అయినా నీకు పెళ్ళయి రెండేళ్ళు కావొస్తోంది యింతదాకా నీ మొదటి భార్యకి ఒక్క బిడ్డ పుట్టలేదు. సంతానం లేని నీగతేం కాను? ఆ భార్యని వదిలెయ్యమనడం లేదు. లలితని కూడా చేసుకుని యిద్దర్నీ సమానంగా చూసుకోరా! పైగా లలిత చిన్నప్పటి నుంచీ నువ్వే తన భర్తవని నమ్ముకుంది. మరొకర్ని పెళ్ళాడమంటే ఒప్పుకోవటం లేదు" అంటూ ఏడ్చి గోల పెట్టింది. నేను అమ్మకి ఎంత సర్దిచెప్పబోయినా వినిపించుకోలేదు. అంతే కాకుండా ఓ రోజు రాత్రి లలిత నా గదిలోకొచ్చి, 'బావా నన్ను నీ యింట్లో ఓ దాసీదానిగా నయినా వుంచుకో బావా! చిన్నప్పటి నుంచీ నా మనసులో నిన్నే భర్తగా వూహించుకున్నాను.త యిప్పుడు ఎవ్వర్నీ వెల్లాడలేను. నా మనసులో భర్తగా మరెవ్వర్నీ వూహించు కోలేను. నన్ను పెళ్ళి చేసుకుని నీ యింటికి తీసుకెళ్ళు అంతే చాలు" అంటూ ఏడుపు మొదలెట్టింది. నిస్సహాయుడినై పోయాను. మర్నాడు ఓ పురోహితుడిని తీసుకొచ్చి నా చేత లలిత మెళ్లో పుస్తె కట్టించారు. తన్ని పెళ్ళి చేసుకుని తీసుకొచ్చినంత మాత్రాన నీకు ఏ లోటు రానివ్వను. మన మధ్య జీవితం యిది వరకు లాగే హాయిగా వుంటుంది. నన్ను నమ్ము. నాకు మాత్రం నా లలితే నా భార్య. నువ్వే నా సర్వస్వం అంటున్న భర్త ముఖంలోకి అసహ్యం, విరక్తి మిళితమైన భావాలతో చూసి లేచి వెళ్ళి పక్కమీద పడుకుంది ప్రేమ.

"ఎంత తియ్యగా మాట్లాడగలరీ మగవాళ్ళు. పిల్లలు లేరని ఈ పిల్లనిచ్చి పెళ్ళి చేశారా? ఈ మధ్యనే తమకి పిల్లలు పుట్టరని తెలిశాక అనాధ శరణాలయం నుంచి ఓ పిల్లని తెచ్చుకుని పెంచుకుందామని అనుకున్నాం కదా!" ఆ సంగతి చెప్పలేదా? అయినా యిదంతా తల్లీ, లలితా చేశారనీ, తను నిరపరాధిననీ నంగనాచిలా మాట్లాడ తాడేమిటి? ఎంత ధైర్యంగా చేశాడీ పని. కనీసం తనతో ఒక్క మాటయినా చెప్పాడా? తన అనుమతి అయినా తీసుకున్నాడా? తనిప్పుడు కోర్టు కెళ్తే! యిప్పుడు తన తల్లిదండ్రులు, చుట్టాలు ఏమంటారు? వారందరి మధ్య తన పరువేం కాను? ఎంత అవమానం. తన వెనక ఏ ఆసరా లేదనే కదా భర్త ధైర్యం? తన గతేం కాను! ఎవరితో చెప్పుకుని తన బాధపడాలి? అంతా 'బాగా అయిందా?' అని హేళన చేస్తారే తప్ప ఓదారుస్తారా? ఇలా ఈ యింట్లో ఈ అవమానాన్ని భరిస్తూ బ్రతక వలసిందేనా?'' ఇలాంటి ఆలోచనలతో బుర్రంతా తొలచసాగింది. ఆనాటి నుంచీ భర్తతో ముభావంగా వుంటూ కాలక్షేపం చెయ్యసాగింది.

కాలం గడుస్తోంది. ప్రేమలో ఒంటరితనం ఎక్కువ కాసాగింది. ఏదో నిశ్చయానికొచ్చిన దానిలా తన చదువుకి తగ్గ ఉద్యోగం కోసం వెతుక్కుని, ఓ ఉద్యోగం సంపాదించుకుని మనసుని మళ్ళించుకోడానికి ప్రయత్నించసాగింది.

"నామ మాత్రానికే లలిత నా భార్య" అన్న శ్రీకాంత్, లలితలు యింట్లో ఒకరితో ఒకరు ఆడుకునే సరసాలూ, వేళాకోళాలూ కళ్ళపడ్డప్పుడు మనసుని ఎవరో పిండే స్తున్నట్టు వుండేది. దేన్నయినా స్త్రీ త్యాగం చేయగలదు గాని ప్రేమించే భర్తని మరొక స్త్రీని త్యాగం చెయ్యడం ఏ స్త్రీకి సాధ్యం కానిది. నెమ్మ నెమ్మదిగా తను శ్రీకాంత్‌కి దూరం కాసాగింది. శ్రీకాంత్‌లో కూడా చాలా మార్పు రావడం గమనించింది.

"ఇహనో, యిప్పుడోగా వుంది మా అమ్మ" అన్న శ్రీకాంత్ తల్లి ఓ రోజు యింటికి రావడం ప్రేమని మరీ ఆశ్చర్యచకితురాల్ని చేసింది. తల్లి రాకతో ఆ యింట్లో మరెన్నో కొత్తమార్పులు రావడం గమనించింది. తల్లీ, కొడుకూ, లలితా కూర్చుని కబుర్లు చెప్పుకోవడం వినేది. నవ్వులూ, కేరింతలు ఇంక ఆనందమంతా తమదే అన్న ధోరణిలో వుండసాగారు. లలితా, తల్లీ తన్ని పట్టించుకోక పోవడం సహజం. కనీసం ప్రేమించి పెళ్ళి చేసుకున్న భర్త, తన వాళ్ళందర్నీ వదిలి తనతో వచ్చేసిన మరో వ్యక్తి ఈ యింట్లో వుందని, ఆమెతో కూడా కాస్సేపు సరదాగా గడుపుదామనీ అనుకుంటున్నట్లు అనిపించేది కాదు ఆ మనిషికి" అని బాధపడ సాగింది. రానురాను విరక్తి, వైరాగ్యం ఆవరించాయి ప్రేమని. తల్లి యింక యిక్కడే వుండి పోడానికి వచ్చినట్లు గ్రహించింది.

కొన్నాళ్ళకి లలిత గర్భవతి అని తెలుసుకుంది. ఆమెని అత్తగారు కాలు క్రింద పెట్టనివ్వకుండా ఎంతో అపురూపంగా చూసుకోసాగింది. తన్నా యింట్లో ఎవ్వరూ పట్టించుకోక పోవడం మాట అటుంచి, ఓ వనికి రాని వస్తువుగా చూడసాగారంతా ఆ యింట్లో.

రాను రాను ప్రేమకి ఆ ఇంట్లో వుండడం చాలా యిబ్బందవుతోంది. ఒంటరి తనం ఎక్కువ కాసాగాంది. ఉద్యోగానికి వెళ్ళడం, రావడం, తనవంట తాను చేసుకోవడం, ఓ గదిలో ఒంటరిగా తన జీవితాన్ని గడపడం చాలా యిబ్బందిగానే వుంది. ఈ నరకం ఎంతకాలం భగవంతుడా!" దీనికి పరిష్కారం ఏమిటి? భర్త కూడా దూరంగానే వుంటున్నాడు" అని తనలో తనే కుమిలిపోసాగింది.

లలితకి శ్రీమంతం చేసినప్పుడు యిల్లంతా సందడే. వూరంతా పిల్చి పండగలా చేస్తున్నప్పుడు తన బాధ వర్ణనాతీతం.

భర్త చాటుగా లలితా, అత్తగారూ తన్ని సూటి పోటీగా ఆడే వెటకారాలూ, దెప్పిపోట్లూ మనసుని ములుకుల్లా పొడుస్తుంటే ఆ యింట్లో వుండడం తనకి గగనమే అయింది.

## అశాంతి

నిశ్శబ్దానికి
రూపం వచ్చినట్టు రాత్రి.
కిటికీ ఊచల్లోంచి
చంద్రుడు ఖైదీలా కనబడుతున్నాడు.
వెన్నెలా నిశ్శబ్దమే.

పారిజాత పరిమళాలూ అంతే.
పువ్వు దగ్గర
చిరుగాలి ఆగుతుంది గాని
అవీ గుసగుసలే.

గూటిలోని చిన్నిపిట్ట
ఏ పీడకలలోనో
ఉలిక్కిపడి లేచి
రెక్కలు విరుచుకొని
అమ్మను తడిమి చూసుకొని
మళ్లీ నిద్రలోకి.

చెట్ల గుబురుల్లోంచి
రాలుతున్న చీకటి.
పొద్దంతా ఆరాటపడ్డ వూరు
నిద్ర దుప్పటి కింద
సేద తీరుతుంది.

ఒక్క నేనే
తపస్సు చెదిరిన మౌనంలా.

**-ఎన్. అరుణ**

ఓ రోజు భర్తతో చెప్పి వేరే గది అద్దెకి తీసుకుని తన సామాన్లు తీసుకుని వెళ్ళి పోతున్న ప్రేమని ఏదో లాంఛనంగా శ్రీకాంత్ 'వద్దు ప్రేమా! ఎందుకు వేరే వెళ్తున్నావు.? నీకేంలోటు చేస్తున్నా?" నంటూ ప్రేమ నటించడం చాలా అనహ్యామనిపించింది. ఎంత నటన? భర్తలోనయినా తనంటే ప్రేమ, గౌరవం వుండి వుంటే అత్తా కోడలు తన్నెంత నీచంగా చూసినా బాధ పడేది కాదు. వారి మాటలకి తగిన జవాబిచ్చి వుండేది. భర్త తన్ని పరాయిదానిలా చూస్తుంటే బాధ ఎవరికి చెప్పుకోవాలి? అనుకుంది.

తనకొచ్చే జీతంతో ఒంటిరిగా కాలం గడుపుకోవడం అలవాటు చేసుకుంది.

ఉదయం కాఫీ తాగుతూ పేపరు చూస్తున్న సమయంలో శ్రీకాంత్ తనింటికి రావడం ఆశ్చర్యాన్ని కలిగించిందనేకంటే షాకయిందనడం సమంజసమేమో! రమ్మనకుండానే లోపలి కొచ్చి, ప్రేమ పక్కనున్న కుర్చీలో కూర్చున్న శ్రీకాంత్ ముఖంలో కళాకాంతులు లేకపోవడంతో ఏదో సందేహం వచ్చింది ప్రేమకి. ఏం మాట్లాడాలో అర్థం కాక "ఎలాగున్నావు శ్రీకాంత్" అంది పొడిపొడిగా.

ఆమె పలకరింపుకి ఏమీ జవాబివ్వకుండానే ఆమె రెండు చేతులూ పట్టుకుని ప్రేమా, యింటికి పద ప్రేమా! నన్ను క్షమించి యింటికిరా! లలిత కొడుకుని కని ప్రాణాలు విడిచేసింది. ఆ చంటి పిల్లాడిని నీకిస్తాను. నువ్వో పాపని పెంచుకుందాం అన్నావు. ఇప్పుడా బాబుని పెంచుదువుగాని. వాడికి తల్లిలేని లోటు నువ్వు తీర్చాలి. అమ్మా పెద్దదయిపోయింది. నేను పిల్లాడిని పెంచలేను. రా, యింటికి వచ్చెయ్యి. నీకూ పిల్లలు లేని లోటు తీరుతుంది" అంటూ బ్రతిమాలుతున్న శ్రీకాంత్ వైపు త్రాచు పాములా లేచి చూస్తూ అతని చేతుల్ని విదిల్చి కొట్టింది ప్రేమ.

కోపంతో వణికి పోతున్న ప్రేమ వైపు భయం భయంగా చూడసాగాడు శ్రీకాంత్.

మీరు మనిషేనా? మీ నోట్లో ఎన్ని నాలుకలున్నాయి? మీ రెండో పెళ్ళాం పోయాకా మళ్ళీ మొదటి భార్య గుర్తొచ్చిందా? అందులో మీ పిల్లాడిని పెంచడానికా? ఎంత సిగ్గు లేదండీ! ఇన్నాళ్ళూ నా పట్ల మీ ప్రేమ ఏమయిందిట? ఆ కొత్త పెళ్ళాన్ని చూడగానే మీరూ, మీ వాళ్ళూ నన్నెంత బాధించారో, నా మనసునెంత చిత్రవథకి గురిచేశారో ఒక్కసారన్నా ఆలోచించుకున్నారా? రెండో పెళ్ళాం వచ్చాకా ఒక్కసారన్నా నాతో ప్రేమగా మాట్లాడేరా? మీ అత్త కూతురు 'రక్త సంబంధం' తన మీదున్న ప్రేమ నా మీదెందుకుంటుంది? ఆ భార్య పోయాక నేను గుర్తొచ్చినందుకు చాలా ధన్యవాదాలు. మీ ధర్మపత్ని, మీ అమ్మా నన్ను ఆ యిల్లు వదిలి వచ్చేలా చేశారు. మీ అమ్మగారు పిల్లాడిని పెంచలేనప్పుడు పరాయి పిల్లాడిని పెంచే ఓపిక నాకెక్కడిది? " అంటున్న ప్రేమని చూస్తూ-

"అది కాదు ప్రేమా" అంటున్న భర్తని చూస్తూ "ఏది కాదు ఇదిగో ఇల్లొదిలి వచ్చిన రోజే నాకూ మీకు సంబంధం తెగిపోయింది. కనీసం నాతో ఒక్క మాటయినా చెప్పకుండా రెండో భార్యంటూ ఆ నాడు ఆమెని తీసుకొచ్చినప్పుడే నేను కోర్టుకెక్కి వుంటే మీ గతేం కాను. కానీ ఒకటి చెప్తున్నాను. ఆనాడు నా దగ్గర ఆర్థిక బలం లేక మీమీద కేసు వెయ్యలేదు. ఇప్పుడు నా కాళ్ళమీద నేను నిలబడ్డాను. ఇన్నాళ్ళూ నాలో పౌరుషం వున్నా బైటికి కనపర్చుకోలేదు. ఇంక మళ్ళీ యిప్పుడు మీరు ఎవర్నేనా పెళ్ళి చేసుకుంటే మాత్రం మిమ్మల్ని కోర్టుకీడ్చి ముప్పుతిప్పలు పెట్టక పోతే నా పేరు ప్రేమ కాదు. మీరు లేకుండా నేను బ్రతక గలుగుతున్నాను. ఆడది లేకుండా మీరు బ్రతకలేరు. ఆ సంగతి నాకు బాగా తెల్సు. నా పట్ల దేముడున్నాడు. మీకు తగిన శిక్ష విధించాడు. మీకిప్పుడు బాధ కలిగింది. అందుకు నేను గుర్తొచ్చానా? నన్నెంత ఏడిపించారో గుర్తు తెచ్చుకోండి. నాకు సిగ్గూ, లజ్జా వున్నాయి. ముందిక్కడి నుంచి లేచి బైటికి నడవండి" అంటూ వీధి గుమ్మం వైపుకి చూపిస్తూ ఏదో సాధించానన్న గర్వంతో, నవ్వుతూ శ్రీకాంత్‌వైపు చూడసాగింది ప్రేమ. ఆడదంటే మరబొమ్మ కాదు. ఆడదీ మనిషే అంటున్న మాటలు శ్రీకాంత్ చెవిన పడక పోలేదు. ■